న్యాయబద్ధంగా పరిహారం ఇవ్వాలి

● జేసీకి బాధితుల విజ్ఞప్తి



వేంపల్లెలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

వేంపల్లె/ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవేలో స్థలాలు, భూములు కోల్పోతున్న తమకు న్యాయబద్ధంగా పరిహారం ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌ను బాధితులు విజ్ఞప్తి చేశారు. రాయచోటి-చాగలమర్రి నేషనల్ హైవే రోడ్డు ఏర్పాటులో భాగంగా వేంపల్లెలో 42ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. సంబంధిత స్థలాల యజమానులు, భూముల రైతులకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళశారం జేసీ సమావేశం నిర్వహించారు. వ్యవసాయ భూమికి సంబంధించి ఎకరాకు రూ.32లక్షలు, ప్లాట్లు ఉన్న స్థలాలకు ఎకరాకు రూ.1.92కోట్లు పరిహారం ఇస్తుందని జేసీ స్పష్టం చేశారు. ప్లాట్లకు సంబంధించిన యజమానులు మాట్లాడుతూ స్థలాల విలువ ఎక్కువ ఉందని, మరింత పరిహారం పెంచి ఇవ్వాలని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పరిహారం నిర్ణయించామని ఆ ప్రకారమే ఇస్తామని జేసీ తెలిపారు. ఆర్డీఓ చిన్నయ్య, నేషనల్ హైవే డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ వెంకటపతి, తహశీల్దార్ హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం మరింత పెంచండి..

నేషనల్ హైవే-440కి భూములు కోల్పోతున్న మతకు నష్టపరిహారం మరించి పెంచి ఇవ్వాలని ఎర్రగుంట్ల మండలంలోని రైతులు జాయింట్ కలెక్టర్ అతిదిసింగ్‌ను కోరారు. ఈ హైవే రోడ్డుకు ఎర్రగుంట్ల నగర పంచాయతి, పెద్దనపాడు, వై.కోడూరు, హనుమనగుత్తి, పోట్లదుర్తికి చెందిన రైతులు సుమారు 130 ఎకరాల భూమిని కోల్పోతున్నారు. ఇందుకు సంబంధించి సంబంధిత రైతులతో మంగళవారం జేసీ భేటీ అయ్యారు. ఎర్రగుంట్ల నగరపంచాయతిని అర్బన్‌గా కాకుండా రూరల్‌గా ట్రీట్ చేయాలని రైతు యోగానందరెడ్డి కోరారు. ఎర్రగుంట్ల నగరపంచాయతికి సంబంధించి అగ్రికల్చర్ భూములకు ఎకరాకు సుమారు రూ.42లక్షల వరకు వస్తుందని జేసీ రైతులకు తెలిపారు. అయితే రూ.42లక్షలకు పైన మరింత పెంచి ఇవ్వాలని రైతులు కోరారు. అలాగే ఎన్‌హెచ్‌కు ఆనుకుని ఉన్న భూములకు రూ.1.1కోట్లు, ఫిట్‌ఫర్ హౌస్ సైట్స్ భూములకు ఎకరాకు రూ.1.22కోట్లు ఇస్తామని జేసీ తెలిపారు. అలాగే ఇతర గ్రామాల రైతులతో కూడా జేసీ మాట్లాడారు. పెద్దనపాడు గ్రామానికి సంబంధించి వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.18.45లక్షలు, ఇళ్లకు సెంటు రూ.1.25 లక్షలు ఇస్తామన్నారు. స్ట్రక్చర్ వ్యాల్యూ ప్రకారం ఇతర వాటికి చెల్లిస్తామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దారు యామిని పాల్గొన్నారు.

మేయర్ X కమిషనర్





కడప కార్పొరేషన్‌లో మేయర్ సురేశ్‌బాబు, కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డిల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. ఈ ప్రభావం నగరాభివృద్ధిపై పడుతోందనే చర్చ సాగుతోంది. ఇప్పటికే పారిశుధ్యం గాడి తప్పింది. అయినా నగరాభివృద్ధికి సంబంధించి స్టాండింగ్ కమిటీ తీసుకునే నిర్ణయాలను కమిషనర్ ఆమోదించడం లేదంటూ మేయర్ వర్గం గుర్రుగా ఉంది. అభివృద్ధి పనుల్లోనూ ప్రోటోకాల్ రచ్చ నడుస్తోంది. దీంతో ఇప్పుడు కడప కార్పొరేషన్‌లో ఇరువురి మధ్య జరుగుతున్న నిశ్శబ్ద యుద్ధం అందరిలో ఆసక్తి రేపుతోంది. ఇది నగరాభివృద్ధికి ఎక్కడ ఆటంకం కలిగిస్తుందో అనే చర్చ కూడా నడుస్తోంది.

- ఇరువురి మధ్య కోల్డ్‌వార్
- ప్రోటోకాల్ పాటించడం లేదంటూ మేయరు వర్గం మండిపాటు
- స్టాండింగ్ కమిటీ తీర్మానాలకు కమిషనర్ తిలోదకాలంటూ ఆగ్రహం
- అభివృద్ధి పనులు ఏమీ జరగడం లేదు..
- ఇక ప్రోటోకాల్ ఆహ్వానాలు ఎక్కడుంటాయి అంటున్న కమిషనర్
- ఇప్పటికే కార్పొరేషన్‌లో గాడితప్పిన పారిశుధ్యం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పాలక వర్గం వైసీపీ చేతుల్లో ఉంది. మేయర్‌గా కె.సురేశ్ బాబు ఉన్నారు. కడప ఎమ్మెల్యేగా ఆర్.మాధవి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కార్పొరేషన్ సమావేశంలో కుర్చీ కోసం మేయర్, ఎమ్మెల్యే మధ్య పెద్ద వాగ్వాదం జరిగిన విషయం అందరికీ తెలిసిందే. ఇది రాష్ట్రంలోనే చర్చనీయాంశంగా మారింది. ఏ కమిషనర్‌కైనా ఇక్కడ పనిచేయడం కత్తిమీద సాములాంటిది. ఎందుకంటే పాలకవర్గం వైసీపీ చేతుల్లో ఉంది. రాష్ట్రంలో అధికారం టీడీపీ చేతుల్లో ఉంది. కడప ఎమ్మెల్యే కూడా టీడీపీనే. ఈ నేపథ్యంలో ఇరువురినీ కలుపుకుని పనిచేయడంలో ప్రస్తుత కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి విఫలమయ్యారనే చర్చ ఉంది.

మేయర్ గరంగరం

కార్పొరేషన్‌కు మేయరే సుప్రీం. పాలకవర్గం, స్టాండింగ్ కమిటీ నిర్ణయాలను తీసుకుంటూ ఉంటాయి. పాలక వర్గం తీసుకున్న నిర్ణయాలతో పాటు ప్రభుత్వమిచ్చే ఆదేశాలను అధికారులతో సమన్వయం చేసుకుంటూ కమిషనర్ ముందుకెళ్లాలి. అయితే ఇప్పుడు మేయర్, కమిషనర్ మధ్య కోల్డ్‌వార్ నడుస్తుండడంతో ఇరువురు ఎడముఖం పెడముఖంగా ఉంటున్నారు. ఇటీవల స్టాండింగ్ కమిటీలో పలు అంశాలపై తీర్మానం చేశారు. వీటిలో కొన్ని అంశాలను కమిషనర్ ఆమోదించడం లేదని మేయర్ అంటున్నారు. అలాగే కార్పొరేషన్ నిధులతో చేపట్టే పనుల్లో స్థానిక కార్పొరేటరు, మేయరును ఆహ్వానించాలి. అయితే ప్రకాశ్‌నగర్, గాంధీనగర్ స్కూలు నుంచి విశ్వేశ్వరయ్య విగ్రహం వరకు వేసిన రోడ్డు, అలంఖాన్‌పల్లెలో అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్, మేయరుకు సమాచారం ఇవ్వకుండా ప్రారంభించారని అంటున్నారు.

సర్వసభ్య సమావేశాల్లో కుర్చీలాట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కడప కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు మూడు సర్వసభ్య సమావేశాలు జరిగాయి. వీటిలో రెండు సమావేశాలు కేవలం కుర్చీలాట కోసం రసాభాసగా మారి వాయిదా పడ్డాయి. ఇప్పుడు సమావేశమందిరానికి ఏకంగా తాళం వేశారు. దీంతో అందులో ఏదో జరుగుతోందనే మేయర్ వర్గం ఆరోపిస్తోంది. వచ్చేది వేసవి. జిల్లా కేంద్రమైన కడపలో తాగునీటి సమస్య లేకుండా చూడాల్సి ఉంది. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ నిరంతరం కొన్ని డివిజన్లలో తాగునీరు అందించాలనే తలంపుతో ఉన్నారు. అయితే మేయర్, కమిషనర్ మధ్య ఫైట్ తాగునీటి సమస్య ఇతరత్రా వాటిపై ప్రభావం చూపుతుందని నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కమిషనర్ సూర్యచంద్ర ఉన్నప్పుడు పారిశుధ్యం మెరుగుపరిచారు. ఆయన కమిషనర్‌గా ఉన్న సమయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో పారిశుధ్య కార్మికులు రోడ్లు శుభ్రం చేసేవారు. పొల్యూషన్ తగ్గడంతో పొల్యూషన్ కంట్రోలు బోర్డు నుంచి ప్రశంసలు అందాయి. ఇప్పుడు మళ్లీ పారిశుధ్యం గాడి తప్పిందనే విమర్శలున్నాయి. సిబ్బందిలో కూడా జవాబుదారీ తనం లేదు. ఇవన్నీ కూటమి ప్రభుత్వంపై ప్రభావం చూపుతాయి. మరి వీరి మధ్య కోల్డ్‌వార్‌కు ఎప్పుడు ఫుల్‌స్టాప్ పడుతుందో చూడాల్సి ఉంది.

ప్రోటోకాల్ పాటించడం లేదు

- సురేశ్‌బాబు, మేయర్, కడప కార్పొరేషన్

స్టాండింగ్ కమిటీ మెజార్టీ సభ్యుల తీర్మానాలను కమిషనర్ ఆమోదించడం లేదు. ఆయన వాటిని పక్కన పెడుతున్నారు. జనరల్ మీటింగ్ సమావేశం కూడా ఆమోదించడం లేదు. వీటిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా. కార్పొరేషన్‌కు మేయరు, పాలకవర్గమే కీలకం. కార్పొరేషన్ నిధులతో పాటు చేపట్టే పనులన్నింటికీ కార్పొరేటరు, మేయరును ఆహ్వానించాలి. కడప కార్పొరేషన్‌లో అలా చేయకుండా అసలు ఏ పదవి లేని ప్రైవేటు వ్యక్తులతో ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ప్రోటోకాల్‌పై కోర్టుకు వెళుతున్నా. ఇక జనరల్ బాడీ సమావేశ మందిరానికి తాళం వేశారు. అందులో గూడుపుఠాణి దాగి ఉంది. మేయరు, పాలకవర్గం చెప్పిన పనులు కమిషనర్ పట్టించుకోవడం లేదు. దీనిపైనా చట్టప్రకారం ముందుకు వెళతాం.

అవి తీర్మానాలు మాత్రమే

- ఎన్.మనోజ్‌రెడ్డి, కమిషనర్, కడప కార్పొరేషన్

కార్పొరేషన్ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు, ఇన్విటేషన్ కార్డులు ప్రింట్ చేయించి నిర్వహించే పనులకు తప్పకుండా ప్రోటోకాల్ పాటిస్తాం. అయితే అటువంటి అభివృద్ధి పనులు జరగడంలేదు. కార్పొరేషన్ నిధులతో ఏమీ చేయడం లేదు. చిన్న చిన్న పనులకు మేయరును పిలవడం సమంజసం కాదు. కార్పొరేషన్ నిధులు కాని పక్షంలో కలెక్టరు ఆదేశాల మేరకు పనులు చేస్తాం. స్టాండింగ్ కమిటీ తీర్మానాలు కేవలం ప్రతిపాదనలు మాత్రమే. ఎగ్జిక్యూటివ్ కమిటీ కార్పొరేషన్ నిధుల సౌలభ్యం బట్టి ఏ పనులు చేయాలి, ఏవి చేయకూడదనే నిర్ణయం తీసుకుంటుంది. దీని ప్రకారం స్టాండింగ్ కమిటీ తీర్మానాలు కొన్ని తిరస్కరించాల్సి ఉంది. అంతే తప్ప మా మధ్య ఎటు వంటి విబేధాలు లేవు.

గుంతపల్లెలో విషాదం

● విద్యుదాఘాతంతో తల్లీకొడుకు మృతి

● బాధిత కుటుంబానికి రూ.10లక్షల సాయం



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ



మృతుడు జయసుబ్బారెడ్డి భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులు, కుమార్తె

బి.కోడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండలంలోని గుంతపల్లెలో విషాదం చోటుచేసుకుంది. పొలానికి నీళ్లు కట్టేందుకు వెళ్లిన తల్లీకొడుకు విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు..

గుంతపల్లెకు చెందిన సుబ్బారెడ్డి, గురమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరికున్న మూడెకరాల పొలాన్ని చెరి సగం ఇచ్చారు. కుమారులు ఇద్దరికీ వివాహాలు కావడంతో ఎవరిబతుకు వారు బతుకుతున్నారు. పెద్దకుమారుడు జయసుబ్బారెడ్డి(47) తమకున్న ఒక టిన్నర ఎకరం పొలంలో పంటలు సాగు చేసుకుంటూ భార్య, ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం సజ్జ పొలానికి నీళ్లు కట్టేం దుకు వెళ్లిన జయసుబ్బారెడ్డి మోటారు వద్ద కాల్వలోకి దిగడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కొడుకును కాపాడే క్రమంలో అతడి తల్లి గురమ్మ (65) కూడా విద్యుదాఘాతంతో చనిపోయారు. చుట్టుపక్కల రైతుల సమాచారంతో పోలీసులకు అక్కడకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్లకు తరలించారు. ఒకే కుటుంబంలో తల్లీకొడుకు మృతిచెందడంతో గుంతపల్లెలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని పిల్లలు, భార్యతో మాట్లాడారు. పార్టీ పరంగా లోకేశ్‌తో మాట్లాడి అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, ముగ్గురు పిల్లలను ఎన్టీఆర్ పాఠశాలలో చేర్పించి విద్యనందించేందుకు కృషి చేస్తామని అన్నారు.

స్పందించిన విద్యుత్ అధికారులు

విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవితో ఫోనులో మాట్లాడి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి మృతుల కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సాయం అందించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. దీంతో మైదుకూరు విద్యుత్ ఈఈ భరణీక్రిష్ణ, పోరుమామిళ్ల ఏడీ రవిచంద్ర కలిసి రూ.10లక్షల చెక్కును మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా మృతుని పిల్లలకు అందించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, రామసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మాచనూరు లక్ష్మీదేవి, మాజీ జడ్పీటీసీ రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం ఇలాకాలో తొలి వికెట్

● వైసీపీ కౌన్సిలర్‌తో పాటు 20 కుటుంబాలు టీడీపీలోకి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇలాకాలో తొలి వికెట్ పడింది. మంగళవారం పులివెందుల మున్సిపాలిటీలో 30 వ వార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ షాహిదతో పాటు 20 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పులివెందుల మున్సిపాలిటీలో మొత్తం 33 వార్డులుండగా గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని వార్డులను వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్, రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో 30వ వార్డు కౌన్సిలర్ షాహిద, ఆమె భర్త మాజీ కౌన్సిలర్ సిద్దయ్యతో పాటు మరో 20 కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా షాహిద మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు ఒక్క సబ్సిడీ లోను కూడా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు సబ్సిడీ రుణాలు ఇస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా బీసీలకు జరుగుతున్న లబ్ధిని చూసి టీడీపీలో చేరామన్నారు.



టీడీపీలో చేరిన కౌన్సిలర్ షాహిద, మరికొందరు

● వేడుకగా ధ్వజారోహణం



కడపలోని విజయదుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న సుధా దుర్గాప్రసాద్, సుధా మల్లికార్జునరావు

సురక్షితమైన బ్రౌజింగ్‌పై అవగాహన ఉండాలి


● డీఆర్వో విశ్వేశ్వరనాయుడు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్నెట్ వినియోగించే సమయంలో సురక్షితమైన బ్రౌజింగ్‌పై అందరికీ అవగాహన ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. సేఫర్ ఇంటర్నెట్ డే సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎన్ఐసీ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులకు ఒక రోజు వర్క్‌షాపు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్వో మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఇంటర్నెట్ వాడకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇంటర్నెట్ ద్వారా చాలా మంది ఎన్నో విధాలుగా ప్రలోభాలకు గురి అవుతున్నారన్నారు. ఏ ఒక్కరూ ఆన్‌లైన్ మోసాలకు, సైబర్ నేరాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మన వైపు నుంచి అన్ని రకాలుగా సైబర్ సెక్యూరిటీ భద్రతలు పాటించాలన్నారు. సైబర్ నేరాలు, బెదిరింపులు, సైబర్ క్రైమ్స్ ఫిర్యాదులను టోల్‌ఫ్రీ నెంబరు 1930 ద్వారా నివేదించాలన్నారు. సురక్షితంగా ఆన్‌లైన్ వాడకంపై డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.స్టేసేఫ్‌ఆన్‌లైన్.ఇన్ వెబ్ సైట్ ద్వారా అవగాహన పెంచుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ల బ్రౌజింగ్, ఈ-ఆఫీసు నిర్వహణ, బ్యాంకింగ్, సోషల్ మీడియా యాప్స్ నిర్వహణ సమయంలో సైబర్ నేరగాళ్ల నుంచి సురక్షితంగా ఇంటర్నెట్ వినియోగించుకోవడం ఎలా? అనే అంశాలపై జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి డాక్టర్ విజయకుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అన్ని శాఖల అధికారులకు అవగాహన కల్పించారు.

కనులపండువగా లూర్దుమాత తిరునాళ్లు



దైవ సందేశం ఇస్తున్న పీఠాధిపతి గాలిబాలి

కడప కల్చరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మరియాపురంలో లూర్దుమాత తిరునాళ్లు కనులపండువగా జరిగాయి. నవదిన ప్రార్థనల చివరిరోజైన మంగళవారం జిల్లా నలు మూలల నుంచి విశ్వాసులు పెద్ద ఎత్తున హాజరై మరియతల్లి సేవలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆవరణం అంతా సందడిగా మారింది. మరియాపురం అపోస్తలిక పరిపాలనాధికారి గాలి బాలి సమిష్టి దివ్య బలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దైవ సందేశం చేస్తూ పాపుల కోసం పశ్చాత్తాపం చెందాలని, మారు మనసు పొంది యేసు ప్రభువు పట్ల పూర్తి అచంచల విశ్వాసంతో మెలగాలని అన్నారు.

బండలాగుడు పోటీలు

లూర్దుమాత తిరునాళ్లలో భాగంగా పాత చర్చి ఆవరణంలో వృషభరాజములచే బండ లాగుడు పోటీలు నిర్వహించారు. ఆర్.శ్రవణ్‌రాజ్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ప్రథమ బహుమతి రూ.70 వేలు ప్రొద్దుటూరు నియోజకవర్గం చౌటపల్లికి చెందిన మార్తల చంద్రఓబుల్‌రెడ్డి వృషభాలు గెలుపొందాయి. ద్వితీయ బహుమతి రూ.50వేలు ప్రొద్దుటూరు నియోజకవర్గం కల్లూరు గ్రామానికి చెందిన పెరుమల శివ కృష్ణయాదవ్, తృతీయ బహుమతి రూ.30 వేలు చాపాడు మండలం సాయి నాగేశ్వర శర్మ వృషభాలు గెలు పొందాయని నిర్వాహకులు వెల్లడించారు.

పన్ను వసూళ్లపై కదలిన యంత్రాంగం

● మొండి బకాయిదారుల దుకాణాలు సీజ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మొండి బకాయిదారుల షాపులను సీజ్ చేస్తున్న కమిషనర్, ఆర్వో

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వసూళ్లపై మున్సిపల్ యంత్రాంగం కదిలింది. ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం' అనే కథనానికి మున్సి పల్ కమిషనర్ మల్లికార్జున స్పందించారు. మంగళవారం టూటౌన్ బైపాస్ రోడ్డు ఏరి యాలో ఇంటి పన్ను బకాయి లున్న వారి దుకాణాలను కమిషనర్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2023-2024, 2024-2025 ఆర్థిక సంవత్సరాలకు బకాయి లున్న వారందరికీ రెడ్ నోటీసులు జారీ చేశామన్నారు. సీజర్ నోటీసులు కూడా ఇస్తున్నామన్నారు. ఇంటి పన్ను రూ.13 కోట్లు, నీటి పన్ను రూ.4.88 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. ప్రతి సచివాలయ పరిధిలోని సిబ్బంది అందరూ పన్ను వసూళ్లపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టి పనిచేయాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఆర్వో శ్రీనివాసరావు, ఆర్‌ఐ శివచరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మామిడి పూత వచ్చిందోచ్..!

- ప్రతికూల వాతావరణంతోనే...
- దిగుబడి ఆలస్యం అవుతుందని రైతుల్లో ఆందోళన



రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట ప్రాంతంలో వచ్చిన మామిడి పూత

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మామిడి పూతలు సాధారణంగా డిసెంబరు మాసంలో వస్తుంటాయి. కానీ ఈ ఏడాది ప్రతికూల వాతావరణంతో పూతలు ఆలస్యంగా వచ్చాయి. దీంతో దిగుబడి ఆలస్యం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుసార్లు వర్షాలు కురవడంతో పిచికారీ చేసిన మందులతో ఫలితాలు లేకుండా పోయాయని రైతులు అంటున్నారు. మామిడి డిసెంబరు మాసంలో పూతలు వచ్చి ఫిబ్రవరి నెలకు పిందె సైజు కాయలు వచ్చి ఉండాలి. అలాంటిది ప్రస్తుతం పూత దశలోనే ఉంది. దీంతో కాయలు ఏప్రిల్ మాసం ఆఖరికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో విజయవాడ, చిత్తూరు, తమిళనాడు తదితర ప్రాంతాలకు చెందిన మామిడి కాయలు మార్కెట్‌లోకి ముందుగానే వచ్చేస్తాయని, ఇక రైల్వేకోడూరు మామిడి కాయలకు డిమాండ్ ఉంటుందా లేదా అన్న సందేహం రైతులు, వ్యాపారుల్లో వ్యక్తమవుతోంది.

రైల్వేకోడూరు, పెనగలూరు, పుల్లంపేట, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాల్లో అత్యధికంగా మామిడి తోటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ సాగుకు ఎకరాకు రూ.60 వేల వరకు రాగా, ఆదాయం రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది. రకాన్ని బట్టి సంవత్సరానికి రెండు కాపుల దిగుబడి ఉంటుంది. కాగా మొదట నియోజకవర్గ వ్యాప్తంగా శెట్టిగుంట నుంచే మామిడి పూతలు మొదలవుతాయి. ఆలస్యమైనా శెట్టిగుంట నుంచే మామిడి పూతలు ఈ ఏడాది కూడా ప్రారంభమయ్యాయి. ఎందుకంటే శెట్టిగుంట ప్రాంతం అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉంటుంది. నీరు, నేలల స్వభావం, రైతుల శ్రమ తదితరవి ఇక్కడ కలసి వస్తాయి. దీంతో పాటు రసాయనిక ఎరువులు తగ్గించి, ఎక్కువగా జీవన ఎరువులు వినియోగం చేయడంతో ఇక్కడ ముందుగా పూతలు వస్తాయని రైతులు అంటున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఖాదర్, పులిహోరా, తోతాపూరి, నీలం, మల్లికా, బేనీషా, మాల్గోవా, నూనెపసందు, రెడ్డీపసందు, కాలేపాడు, నాటు రకాలు, ఊరగాయ రకాల మామిడిని రైతులు సాగుచేస్తున్నారు. రైల్వేకోడూరులో సుమారు 45 మామిడి మండీలు ఉన్నాయి. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు రైతులు, వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడ పండించే మామిడి రుచి, రంగు, వాసన ఉంటుంది. అందువల్ల దక్షిణ భారతదేశంలోనే రైల్వేకోడూరు మామిడికి పేరు ఉంది. ఢిల్లీ, ముంబై, తమిళనాడు, కేరళ, ఆగ్రా తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు రైల్వేకోడూరుకు వచ్చి మకాం వేసి వ్యాపారం చేస్తారు. సీజన్‌లో సుమారు రూ.100 కోట్లకు పైబడి వ్యాపారం సాగుతుంది. గుత్తి, గుంతకల్లు, ఆళ్లగడ్డ, నంద్యాల, కడప, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి కూలీలు సీజన్‌లో ఉండి పనులు చేస్తారు. సుమారు వెయ్యి మంది కూలీలు వస్తారు. చాలా మంది రైతులు ఆర్గానిక్‌తో మామిడి పంటను సాగు చేస్తున్నారు. మరికొందరు ప్రకృతి పరంగా లభించే వాటితో మొక్కలకు అందిస్తున్నారు. రసాయనిక ఎరువులు కొద్దిగానే వాడుతున్నారు. మందులు చాలా మంది వేపనూనెను పిచికారీ చేస్తున్నారు. దీంతో కాయలకు మచ్చరాదని రైతులు అంటున్నారు.



మామిడిపై ఆశలు పెట్టుకున్నాం

ఈ ఏడాది మామిడిపై ఆశలు పెట్టుకున్నాం. కానీ ఆలస్యంగా పూతలు వచ్చాయి. దిగుబడులు బాగా వస్తాయని అనుకుంటున్నాము. ఇప్పటికే సాగు కోసం ఎకరాకు రూ. 60 వేలు ఖర్చు చేసి ఉన్నాం. కాయలు వచ్చే సమయానికి డిమాండు ఉంటే రైతులు పెట్టిన పెట్టుబడి వస్తుంది. లేదంటే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

- చంద్ర, రైతు, శెట్టిగుంట

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

-ఎన్.వెంకటరమణ, ఆదర్శ రైతు, శెట్టిగుంట



మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి. కోతలు పూర్తి కాగానే కొమ్మ కత్తిరింపులు జరిగిపోవాలి. ప్రతి ఏటా సెప్టెంబరు మాసంలో ఎరువులు వేసుకోవాలి. గ్రామీణ ప్రాంతంలో లభించే వేప ఆకు, గానుగ పిండి, దిబ్బ ఎరువు తదితర వాటిని సేకరించి పాదుల్లో వేసుకోవాలి. మల్టీ విటమిన్ పరంగా ఉన్న మందులు పిచికారీ చేసుకోవాలి. దీంతో మామిడి చెట్లకు పోషకాలు అందుతాయి. కాపు పుష్కలంగా అందుతుంది. దిగుబడులు బాగా అందుతాయి. వేపనూనె మామిడికి పిచికారీ చేస్తే కాయకు మచ్చలు ఏర్పడకుండా ఉంటుంది.

భూముల యూనిక్ ఐడీ కోసం

నమోదు చేసుకోండి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

రామాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ భూముల యూనిక్ ఐడీ కోసం పట్టాదారు పాసుబుక్కు, లేదా వన్‌బీ, ఆధార్ కార్డుతో లింకు ఉన్న ఫోన్ నెంబర్ రైతు సేవ కేంద్రంలో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. మండలంలోని నల్లగుట్టపల్లి రైతు సేవ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగం డిజిటలైజేషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆధార్ కార్డు తరహాలో 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు (యూనిక్ ఐడీ) ఇస్తుందన్నారు. సొంత భూములు గల రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న వివిధ పథకాలు, రాయితీలు, సేవలు పొందాలంటే రైతు ఈ 11 అంకెల విశిష్ట సంఖ్య తప్పనిసరి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, ఏఈవో కవిత, రైతు సేవ కేంద్రం సిబ్బంది లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు జన్మనిస్తే.. హెల్మెట్ పునర్జన్మనిస్తుంది

- జిల్లా రవాణా శాఖాధికారి ప్రసాద్

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు జన్మనిస్తే.. హెల్మెట్ పునర్జన్మనిస్తుందని జిల్లా రవాణాశాఖాధికారి ప్రసాద్ అన్నారు. మంగళవారం అన్నమాచార్య యూనివర్సిటీలో నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాల్లో ఆయన ప్రసంగించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ , కార్లు నడిపేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనం నడిపేటపుడు అతి వేగం, మద్యం మత్తు, సెల్‌ఫోన్‌లో మాట్లాడడం ప్రమాదకరమన్నారు. వీటిని నివారిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గించవచ్చునన్నారు. రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. రాజంపేట మోటారు వాహనాల తనిఖీ అధికారి వినోద్‌కుమార్, మన్నూరు సీఐ అలీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ తదితరులు మాట్లాడారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా మోటారు వాహనాల తనిఖీ అధికారి ప్రసాద్

చెరువును ఆక్రమించారని ప్రహరీ తొలగింపు



చెరువును ఆక్రమించి కట్టిన ప్రహరీని తొలగిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలోని అన్నమాచార్య విశ్వవిద్యాలయానికి సంబంధించిన ప్రహరీ చెరువు ఆక్రమణలో ఉందని రాజంపేట తహశీల్దారు పీరుమున్నీ ఆధ్వర్యంలో దానిని తొలగించారు. చెరువును ఆనుకుని 1.50 ఎకరాల్లో ప్రహరీని నిర్మించారని సర్వే చేసి ఆక్రమణ జరిగిందని నిర్ధారించి సోమ, మంగళవారాల్లో ఎక్స్‌కవేటర్‌తో దానిని తొలగించారు. ఇటీవల చెరువు ఆక్రమణ జరిగిందంటూ చుట్టుపక్కల గ్రామస్థులు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో సర్వే చేసి చెరువు ఆక్రమణకు గురైన ప్రాంతంలో నిర్మించిన గోడను తొలగించారు. సర్వేనంబరు 1082లో ఈ ఆక్రమణ జరిగినట్లు గుర్తించి తొలగించినట్లు తహశీల్దారు పీరుమున్నీ తెలిపారు. వీఆర్వో, సర్వేయర్, ఆర్ఐ తదితరులు ఈ గోడ కూల్చే కార్యక్రమంలో తహశీల్దారుతో కలిసి పాల్గొన్నారు.

ఆక్రమణపై సమగ్ర సర్వే చేయాలి

అన్నమాచార్య యూనివర్సిటీ వారు ఆక్రమించిన భూములపై సమగ్ర విచారణ చేసి తొలగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేశ్‌నాయుడు డిమాండ్ చేశారు. తూతూ మంత్రంగా ఒకటి రెండు చోట్ల గోడలను తొలగించిన మాత్రాన ఆక్రమణలు పోవని, దీనిపై సమగ్ర విచారణ చేసి వారు ఆక్రమించిన భూములన్నింటిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో తహసీల్దార్‌లు, సర్వేశాఖ సిబ్బంది, వీఆర్‌వోలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వే, రెవెన్యూ సదస్సుల అర్జీలు, పీజీఆర్ఎస్ అర్జీలు, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి తీసుకున్న అభిప్రాయాలు, తదితర అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని, తహసీల్దార్లందరూ ఈ విషయంపై దృష్టి సారించాలన్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి తీసుకున్న అభిప్రాయాలను వీఆర్‌వోలతో, గ్రామ స్థాయి సర్వేయర్లతో సమీక్ష జరిపి అర్జీదారుల సంతృప్తి స్థాయిని పెంచాలన్నారు. పలు మండలాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రీసర్వే గురించి మాట్లాడుతూ మండల సర్వేయర్లు అందరూ దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న రీసర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదనరావు, సబ్‌కలెక్టర్లు, ఆర్డీవో సర్వే శాఖ ఏడీ, తహసీల్దార్‌లు, రెవెన్యూ శాఖ సిబ్బంది, సర్వేశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకుంటున్నట్లు

జనసేన నాయకుడి వీడియో

- ఫోన్ స్విచాఫ్ చేసి అజ్ఞాతంలోకి
- గాలింపు చేపట్టి ఆచూకీ కనుగొన్న పోలీసులు



పోలీసుస్టేషన్‌లో అస్లామ్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి

కలికిరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని వీడియో పోస్టు చేసి ఫోన్ స్విచాఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన జనసేన నాయకుడి ఆచూకీని పోలీసులు ఎట్టకేలకు కనుగొన్నారు. వివరాలిలా ఉన్నాయి. జనసేన మండల నాయకుడు అస్లామ్ స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు సబ్ కాంట్రాక్టు పొందాడు. మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో స్మార్ట్ మీటర్లు బిగించే పనిని చేపట్టాడు. హైదరాబాదుకు చెందిన కాంట్రాక్టు సంస్థ అపర్ణ ఓవర్సీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ తరపున స్మార్ట్ మీటర్లు బిగించే పని నవంబరు నుంచి మొదలు పెట్టాడు. ఈ పనుల కోసం రూ.13.50 లక్షల బిల్లులు అస్లామ్‌కు అపర్ణ సంస్థ చెల్లించాల్సి ఉంది. ఎన్ని రోజులైనా బిల్లులు రాకపోడంతో స్థానికంగా కూలీలకు సర్దుబాటు చేయలేక ఆర్థిక సమస్యల్లోకి వెళ్లాడు. మంగళవారం తన సమస్యలకు సంబంధించి అస్లామ్ వీడియోను రికార్డు చేసి జనసేన గ్రూపులో పోస్ట్ చేశాడు. బిల్లులు రాకపోవడంతో తాను ఆత్మహత్య చేసుకోవడం మినహా మార్గం లేదని ఈ వీడియోలో పేర్కొంటూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. విషయం తెలిసిన వెంటనే మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్ తదితరులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఆ తరువాత అస్లామ్ భార్య స్వాతి ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు టీములు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈలోగా రాయచోటి నుంచి డాగ్ స్క్వాడ్‌ను కూడా రప్పించి అన్ని కోణాల్లో గాలింపు ముమ్మరం చేశారు. సెల్‌ఫోను స్విచాఫ్‌లో ఉండటంతో అస్లామ్ ఆచూకీ క్లిష్టతరంగా మారింది. అనంతరం ఇతర ఆధునిక సాంకేతిక విధానాల్లో శోధించారు. ఎట్టకేలకు రాత్రి 7.30 గంటల సమయంలో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల పరిసరాల్లో అస్లామ్ ఆచూకీ కనుగొన్నారు. ఆ వెంటనే పోలీసులు అతడిని పోలీసుస్టేషనుకు తీసుకొచ్చారు. అక్కడి నుంచే ఎస్పీతో మాట్లాడించారు. అనంతరం సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి స్థానిక నాయకుల సమక్షంలో అస్లామ్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. జనసేన పీలేరు ఇన్‌చార్జ్ బెజవాడ దినేష్, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, పంచాయతీ వార్డు సభ్యుడు సనావుల్లా, వైజాగ్ బాషా, వెంకటనారాయణ రెడ్డి తదితరులు హాజరయ్యారు. అస్లామ్ భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు

- 11 అంకెలతో ఏపీఎఫ్ఆర్ కార్డులు జారీ
- జిల్లాలో నమోదు ప్రక్రియ ప్రారంభం



మదనపల్లె రైతు సేవా కేంద్రంలో రైతుల వివరాలతో ఏపీఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆధార్‌కార్డు, విద్యార్థులకు అపార్ కార్డు మంజూరు చేసిన విధంగానే రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డు (యూనిక్ ఐడెంటిటీ కార్డు) జారీ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపక్రమించాయి. 11 అంకెలతో ఒక రైతుకు ఒకే గుర్తింపు కార్డు నమోదు చేసి పంపిణీ చేయనున్నారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ ఏపీఎఫ్ఆర్ కార్డుల జారీ ప్రక్రయను ప్రారంభించింది. 30 మండలాల్లోని రైతు సేవా కేంద్రాలకు రైతులను పిలిపించుకుని ఏపీఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. తొలుత పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న రైతులకే ఈ గుర్తింపు కార్డు జారీ చేయనుండగా, డీకేటీ రైతులకు మాత్రం ఇప్పట్లో ఈ గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదు.

ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ కార్డు

దేశంలోని పౌరులందరికీ యూనిక్ రిజిస్ట్రేషన్ కార్డు (ఆధార్‌కార్డులు), విద్యార్థులకు అపార్ కార్డులు పంపిణీ చేసిన విధంగానే రైతులకూ ఒక ప్రత్యేక గుర్తింపు కార్డు పంపిణీ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగాయి. ఇప్పటికే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో రైతులకు యూనిక్ గుర్తింపు కార్డులు పంపిణీ చేసేశారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కూడా రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేసేందుకు వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులు సంయుక్తంగా ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాలోని 30 మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ ఏపీఎఫ్ఆర్ ప్రక్రియ ప్రారంభించారు.

ఏపీఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ ఎలాగంటే..?

ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీ నెంబర్ కోసం రైతులు పలు రికార్డులను అధికారుల వద్ద సమర్పించాల్సి ఉంటుంది. ఇందులో రైతు ఆధార్ కార్డు, సెటిల్‌మెంట్ భూమి పట్టాదారు పాసు పుస్తకం, భూమి వన్-బీ పత్రాలు, బ్యాంకు అకౌంటు పుస్తకం, రేషన్ కార్డుతో పాటు ఆధార్‌కార్డుతో లింకు అయిన మొబైల్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలి. వీటితో పాటు రైతు పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళ్లాలి. అక్కడి సిబ్బంది ఆన్‌లైన్‌లో డిజిటల్ విధానంలో ఏపీఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. రైతుల మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటీపీ ఆధారంగా ఈ ప్రక్రియ పూర్తి అవుతుంది. ప్రభుత్వం నుంచి రైతులకు అందించే సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమ అయ్యేందుకు బ్యాంకు పుస్తకం తీసుకెళ్లాలి.

ఏపీఎఫ్ఆర్‌తో ఉపయోగాలు

ఏపీఎఫ్ఆర్ కార్డు పొందిన రైతుల పేర్లు ఆయా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ అవుతాయి. రైతుల భూమి, పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకానికి ప్రతిసారి రైతు వెళ్లి దరఖాస్తు చేసుకునే అవసరం లేకుండా ఒక్కసారి ఏపీఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ అయితే అన్ని పథకాలు రైతులకు అందుబాటులోకి వస్తాయి. ముఖ్యంగా పీఎం-కిసాన్, రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు సుఖీభవ, వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా సబ్సిడీతో అందించే ట్రాక్టర్, టిల్లర్లు, ఉపకరణాలు, పరికరాలు రైతులకు అందుతాయి. అంతే కాకుండా ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులకు సబ్సిడీతో అందించే వేరుశనగ, కందులు, ఉలవలు, మొక్కజొన్న విత్తనాలు సకాలంలో, సక్రమంగా పంపిణీకి ఏపీఎఫ్ఆర్ ఉపయోగపడుతాయి. వీటికి తోడు సబ్సిడీతో అందించే సేంద్రియ ఎరువులు, రసాయన ఎరువులు, కాంప్లెక్స్ ఎరువులు రైతులకు నేరుగా అందేందుకు అవకాశం ఉంది. ఇవి ఇలా ఉండగా కరువు, వర్షాభావంతో పంటలు నష్టపోతే క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ పరిహారాలు కూడా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేసేందుకు ఏపీ ఎఫ్ఆర్ ఉపయోగపడుతుంది. ఇలా ఏపీఎఫ్ఆర్ కార్డు వలన సమయం, పేపర్లు వృథా కాకుండా ఆధునిక పద్ధతిలో రైతులకు అన్ని విధాలా ఉపయోగాలు అందనున్నాయి.

సెటిల్‌మెంట్ భూములున్న రైతులే అర్హులు

జిల్లాలో ఏపీఎఫ్ఆర్ కార్డుల మంజూరుకు ప్రభుత్వం పలు నిబంధనలను అమలులోకి తీసుకొచ్చింది. ఇందులో సెటిల్‌మెంట్ భూములున్న రైతులకే ఏపీఎఫ్ఆర్ కార్డులు మంజూరు చేస్తారు. భూమి వన్-బీ, పాసుపుస్తకాలు, ఖతా నెంబర్ వున్న వారికి మాత్రమే తొలుత రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. జిల్లాలో సుమారు 1.80 లక్షల మంది రైతులకు ఖాతాలు ఉండగా వీరికి మాత్రమే ఏపీ ఎఫ్ఆర్ కార్డు జారీ ప్రక్రియ జరుగుతోంది. మిగిలిన డీకేటీ భూములు ఉన్న రైతులకు మాత్రం వచ్చే ఆరు నెలల్లో ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాల మేరకు ఏపీఎఫ్ఆర్ నెంబర్ మంజూరు చేసే అవకాశం ఉంది. ఇకపోతే కౌలు రైతులకు మాత్రం ఈ సౌకర్యం అందుబాటులోకి రాదు, కేవల కౌలు రైతులకు ఇచ్చే పాత గుర్తింపు కార్డులతోనే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందనుంది.



వివరాలు నమోదు చేస్తున్న ఆర్ఎస్‌కే సిబ్బంది

రైతులకు మంచి అవకాశం

రైతులకు ఇంది మంచి అవకాశం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రూ.6 వేలు, రూ.14 వేల పీఎం కిసాన్, సుఖీభవ పథకాలు అందాలంటే రైతులు తప్పనిసరిగా ఏపీఎఫ్ఆర్ కార్డులు తీసుకోవాలి. వీటితో పాటు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు సకాలంలో రైతులు తీసుకోవచ్చు. ఈనెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని కృషి చేస్తున్నాం. రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా ఏపీఎఫ్ఆర్ కార్డులు పంపిణీ చేసే ప్రక్రియలో ఆరో స్థానంలో ఉంది.

- చంద్రానాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, రాయచోటి

గండికోట ప్రాజెక్టులో బోటింగ్ ఎప్పుడో...

చుట్టూ కొండల మధ్య కృష్ణాజలాలతో నిండుకుండలా దర్శనమిస్తున్న గండికోట ప్రాజెక్టు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటుంది. ఇక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. సొరంగం ద్వారా ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చే దృశ్యం పర్యాటకులను కట్టిపడేస్తుంది. ఈ ప్రాంతంలో బోటింగ్ సౌకర్యం కోసం పర్యాటకులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూపులు చూస్తున్నా గత వైసీపీ ప్రభుత్వం దీని గురించి అసలు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అయినా స్పందిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

- పర్యాటకుల ఎదురుచూపులు
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలోనైనా అమలయ్యేనా..

కొండాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు గండికోట ప్రాజెక్టు గుండెకాయలాంటిది. 26.85 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు కరువు బారిన పడకుండా జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటోంది. జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా గండికోటకు కృష్ణాజలాలు వస్తాయి. కృష్ణాజలాలు గండికోట ప్రాజె క్టులోకి చేరేందుకు కొండలు అడ్డం ఉండటంతో సొరంగాన్ని నిర్మించారు. మైలవరం మండలం లింగాపురం నుంచి గండికోటప్రాజెక్టు వరకు 5.5 కిలోమీటర్లు సొరంగాన్ని నిర్మించారు. ఈ సొరంగ మార్గం ద్వారా కృష్ణాజలాలు గండికోట ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చే దృశ్యం పర్యాటకులను ఆకట్టుకుంటుంది.



రెండుకొండల మధ్య కృష్ణాజలాలతో కళకళలాడుతున్న గండికోట జలాశయం

బోటింగ్ ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధి

గండికోట ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే బోటింగ్ ఏర్పాటు తప్పనిసరి. ఇప్పటికే మైలవరం జలాశయంలో బోటింగ్ ఏర్పాటు చేసినా, దానికంటే పెద్దదైన గండికోట ప్రాజెక్టులో ఇంత వరకు బోటింగ్ కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ప్రాజె క్టు కింద 22 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ముంపునకు గురైన ఈ ప్రాంతంలో బ్యాక్‌వాటర్‌తో కృష్ణా జలాలు కనువిందు చేస్తాయి. ఈ ప్రాంతంలో బోటింగ్‌ను ఏర్పాటు చేస్తే గండికోట వెనుక జలాలను ఆస్వాదించవచ్చు. రెండు కొండల మధ్య ఉన్న ప్రాజెక్టునుంచి గండి కోట సొరంగతో పాటు చుట్టూ ఉన్న అందాలను బోటింగ్ ద్వారా వీక్షించవచ్చు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చెందేనా...

గండికోట ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గండికోట ప్రాజెక్టు ప్రాంతంలో వెనుకజలాల్లో బోటింగ్ సౌకర్యం, రిసార్ట్‌లు, వ్యూపాయంట్లు వంటి వాటిని ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్ తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే గండికోట ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి చెందేం దుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

బ్రహ్మోత్సవాల నాటికి ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తి : జేఈవో



బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

రాజంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నాటికి ఆలయ జీర్ణోద్ధరణ పనులన్నీ పూర్తి చేస్తామని, టీటీడీ అధికారులు, కడప జిల్లా అధికార యంత్రాంగం తో కలిసి ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపా రు. మంగళవారం ఆయన ఒంటిమిట్ట ఆలయంలో జరుగుతున్న జీర్ణోద్ధరణ పనులు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను అధికారులతో కలిసి పర్యవేక్షించారు.

ఈసందర్భంగా అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం గత ఏడాది సెప్టెంబరు 6 నుంచి 9వ తేదీ వరకు బాలాలయం నిర్వహించామన్నారు. భారత పురావస్తుశాఖ ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. కడప జిల్లా అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుని స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఏప్రిల్‌లో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఎలక్ట్రికల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సదా లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫేజ్-1 ఫలితాల్లో నారాయణ విద్యార్థుల హవా



ఉత్తమ పర్సంటైల్ సాధించిన నారాయణ కళాశాల విద్యార్థులు

కడప(వినాయకనగర్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కడప నారాయణ కళాశాల విద్యార్థులు మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫేజ్-1 ఫలితాలలో సత్తా చాటారు. కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి మంచి పర్సంటైల్ సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఎస్.అబ్దుల్ హసీమ్-99.91, బి.వెంకటరామ్‌శరణ్-99.87, బి.జగన్ శ్మరణ్-99.84, ధనుష్-99.77, సి.ఆదిత్యవర్ధన్-99.62, పి.సుధీర్‌కుమార్-99.61, ఎన్.సి.ధీరజ్‌కుమార్-99.47, ఎం.శ్రీలేఖ-99.29, సి.నితిన్‌రెడ్డి-98.90, ఉమర్-98.83, హసాన్-98.57, అజాన్-98.33, రోహిత్‌రెడ్డి-98.22, పర్సెంటైల్ సాధించారన్నారు. విద్యార్థులు తమ పట్టుదలతో పాటు తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో ఈ ఘన విజయం సాధించినట్లు తెలిపారు. ఈసందర్భగా విద్యార్థులు మాట్లాడుతూ నారాయణ అకడమిక్ ప్రోగ్రామ్ మరియు అధ్యాపకుల ప్రోత్సాహంతో ఈ విజయం సాధిం చగలిగామన్నారు. నారాయణ యాజమన్యానికి, అధ్యాపక బృందానికి మరియు డీజీఎం రామమోహన్‌రెడ్డి, కోర్ డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, డీన్ బాలవెంకటరెడ్డి, ప్రిన్సి పాల్స్ మురళీ మోహన్, వెంకటస్వామి, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, సుమన్, ఏజీఎం చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దాల్మియా పరిశ్రమతో నష్టాలపై విచారణ

మైలవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దాల్మియా పరిశ్రమలో చేపట్టే పేలుళ్ల కారణంగా ఇళ్లు, పంట పొలాలు నష్టపోవడంతో పాటు పరిశ్రమ నుంచి వెలువడే పొగతో అనారోగ్యం పాలవుతున్నట్లు మల్లికార్జున అనే వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. ఇందుకు లోకాయుక్త స్పందించి బాధితుల సమస్యలపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. అందులో భాగంగా మంగళవారం మండల పరిధిలోని దుగ్గనపల్లె, నవాబుపేట, చిన్నకొమెర్ల గ్రామాల రైతులతో ఉన్నతస్థాయి కమిటీ సభ్యులైన జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, వ్యవసాయశాఖ అధికారులు నాయక్, అనిత, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, జలవనరుల, గనుల శాఖలకు సంబంధించిన అధికారుల బృందం రైతులతో విచారణ చేపట్టింది. మొదట చిన్నకొమెర్ల రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి సమస్యలు విన్న అనంతరం దుమ్ము, ధూళితో నిండిన పంట పొలాలను పరిశీలించారు. దాల్మియా పరిశ్రమ వలన పంట పొలాల్లో మిరప, పత్తి, శనగ తదితర పంటలపై దుమ్ము, ధూళి పడటంతో కాపు సరిగా రాక లక్షల రూపాయలు నష్టపోతున్నామని వారికి వివరించారు. నష్టపోయిన వారందరికి నష్టపరిహారం అందించాలని కోరారు. అలాగే వర్షాలు ఎక్కువగాపడే సమయంలో వంక ద్వారా వచ్చే నీరు పంట పొలాలపైకి పడి పంటలు దెబ్బతిని నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే బ్లాస్టింగ్ వలన గృహాలు నెర్రలు చీలుతున్నాయని తెలిపారు. నవాబుపేట నుంచి చిన్నకొమెర్లకు వచ్చే మార్గంలో దాల్మియా రైలు గేటు వేస్తే గంటల తరబడి తీయరని, చుట్టుపక్కల గ్రామాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, పలు శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



దుమ్ము, ధూళితో ఎండిన మిరప పంటను పరిశీలిస్తున్న విచారణ కమిటీ సభ్యులు

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం...



చెక్కును అందిస్తున్న అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు

కడప క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. రాజుపాలెం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఎ.వెంకటసుబ్బయ్య కుటుంబానికి పోలీసు వితరణ నిధి నుంచి రూ.2.5 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ సతీమణి ఎ.రాజేశ్వరికి చెక్కు అందించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ దివంగత హెడ్‌కానిస్టేబుల్ కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీ సు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులు అరెస్టు

- బంగారు ఆభరణాలు, రెండు బైకులు స్వాధీనం



పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న బైకులను చూపుతున్న ఎస్ఐ చంద్రశేఖర్

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మహిళల మెడలో గొలుసులు అపహరణ చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి బంగారుతో పాటు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం బ్రహ్మంగారిమఠం పోలీసుస్టేషన్‌లో పాత్రికేయులతో ఎస్ఐ మాట్లాడుతూ ఫిబ్రవరి 7వ తేదీ మండల కేంద్రంలో ఉన్న మండ్ల నాగమ్మ అనే మహిళ మెడలో నుంచి తాళి బొట్టు సరుడు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ నేపధ్యంలో మంగళవారం మండలంలోని రేకలకుంట్ల రాణిబావి చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనం ఆపకుండా వెళ్లడంతో అనుమానం వచ్చి ఇద్దరిని అదుపులోకి తీసుకుని సుమారు ఎనిమిదిన్నర తులం బంగారం, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణం వాజ్‌పేయినగర్ గ్రామానికి చెందిన మల్లె భరత్, సీకే దిన్నె మండలానికి చెందిన రాజా అనే వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఏఎస్సై గురప్ప, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

75 చౌకబియ్యం బస్తాలు పట్టివేత



పట్టుబడ్డ చౌక బియ్యం బస్తాలను చూపుతున్న సీఐ

చెన్నూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపవరం గ్రామ సమీపంలో కేసీ ప్రధాన కాల్వకట్ట వద్ద గల రేకుల ఇంటిలో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న 75 చౌక బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. పక్కాగా అందిన సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం దాడి చేసి చౌకబియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని ఆర్ఐ కౌశిక్, వీఆర్వోవెంకటసుబ్బయ్య ద్వారా గోడౌన్‌కు తరలించినట్లు తెలిపారు.

గొలుసు లాక్కెళ్లిన యువకుడు అరెస్టు

కడప క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం దేవుని కడపలో ఈనెల 4న మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన యువకుడిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. మహారాష్ట్ర నుంచి ఆకాశ్ భాస్కర్ కడపకు వచ్చి రథసప్తమి సందర్భంగా దేవుని కడప వద్ద ఒంటరిగా ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. ఎస్ఐలు రవికుమార్, రాజరాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆకాశ్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి మూడు తులాలు బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మాతంగి రాజశ్యామలాదేవికి ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమాల్లో పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతిస్వామి

చెన్నూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామంలో కొలువైన రాజశ్యామలాదేవి వార్షికోత్సవంలో భాగంగా 14వ రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతిస్వామి మాట్లాడుతూ దశ మహా విద్యల్లో అమ్మవారు శ్యామలాదేవి ఎంతో సాత్వికరూపంతో కరుణాకటాక్షాలతో అందరినీ దీవిస్తుందన్నారు.

మైలవరం జలాశయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ విన్యాసాలు

మైలవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయంలో జిల్లా కలెక్టర్, 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో మోకా ఎక్సర్‌సైజ్ విన్యాసాలను మంగళవారం చేశారు. విపత్తు సంబంధించి ఎలా కాపాడుకోవాలి, ఎలా రక్షించాలి, ఈత వచ్చినవారు ఎలా కాపాడాలి, ఈతరానివారి పరిస్థితి ఏమిటి తదితర వాటిపై విన్యాసాలు చేసి చూపించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ సీఐ గోపాలకృష్ణ, జలాశయ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మైలవరం జలాశయం వద్ద ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

ప్రస్తుత ధరలకు అనుగుణంగా నష్టపరిహారం ఇవ్వాలి

- జేసీ వద్ద మొరపెట్టుకున్న భూ నిర్వాసితులు

ప్రొద్దుటూరు రూరల్/ రాజుపాళెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి పంచాయతీ మీదుగా మార్కింగ్ వేసిన నేషనల్ హైవే 440 రహదారి స్థలాలకు ప్రభుత్వం ప్రస్తుత ధరలకు అనుగుణంగా నష్టపరిహారం ప్రకటించి.. స్థలానికి బదులుగా స్థలం ఇవ్వాలని భూ నిర్వాసితులు కోరారు. మంగళవారం కొత్తపల్లె పంచాయతీ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ అతిధిసింగ్ భూ నిర్వాసితులతో సమావేశమై ఏవైనా అభ్యంతరాలు తెలపవచ్చని తెలుపవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధితులు తమ గోడును విన్నవించుకున్నారు. ఏళ్ల తరబడి కాపాడుకుంటూ వస్తున్న తమ భూములకు ప్రభుత్వం నిర్ణయించిన ధర మార్కెట్ వాల్యూ మధ్య వ్యత్యాసం భూమికి ఆకాశానికి ఉన్నంత ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ భూములకన్నా ఇండ్ల నిర్మాణానికి వేసిన వెంచర్లు, ప్లాట్లతో అభివృద్ధి చెందిన ప్రాంతమని, సెంటు భూమి కొన్ని ప్రాంతాల్లో సుమారు రూ.20 లక్షలకుపైగా మార్కెట్ విలువ ఉందని వివరించారు. కోట్ల రూపాయల భూమిని కోల్పోయి తమపై ఆధారపడిన కుటుంబాలను, పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టలేమని వాపోయారు. భూ నిర్వాసితుల ఆవేదన, డిమాండ్లను జాయింట్ కలెక్టర్ రికార్డు చేశామని, అందుకు తగిన నివేదికలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ప్రొద్దుటూరు తహసీల్దారు గంగయ్య, డిప్యూటీ తహసీల్దారు సాయినాథరెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్‌కు తమ గోడు వినిపిస్తున్న బాధితులు

బహిరంగమార్కెట్ ధర కల్పించండి

రిజిస్ట్రేషన్ విలువతో కాకుండా బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని కొరపాడు గ్రామ రైతులు జాయింట్ కలెక్టరు అతిదిసింగ్‌కు వినతిపత్రం అందించారు. మంగళవారం సాయంత్రం కొరపాడు గ్రామ సచివాలయ ఆవరణలో జాతీయ రహదారి 440కి భూమి కోల్పోతున్న రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టరు రైతులతో మాట్లాడుతూ గత మూడేళ్లుగా భూమి క్రయ విక్రయ ఆధారంగా నష్టపరిహారం అందిస్తామన్నారు, జాతీయ రహదారికి భూములు కోల్పోతున్నే రైతన్నలకు ప్రస్తుతం ఎకరాకు 10.60లక్షలు కాకుండా మరో ఐదు లక్షలు అదనంగా నష్టపరిహారం ఇస్తామని అన్నారు. రోడ్డు పక్కనే పోతున్న భూములకు కొరపాడు రెవెన్యూ గ్రామానికి సంబంధించి వివరాలతో అవార్డు ప్రకటిస్తామన్నారు. ఆ తరువాత మరో కొంత నష్టపరిహారం కోసం కలెక్టరుకు వినతిపత్రం అందించవచ్చని రైతులకు సూచించారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా చూస్తా మన్నారు. రైతులు మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణానికి తమ గ్రామం దగ్గరలోఉందని ఇక్కడ బహిరంగమార్కెట్ ఎకరాకు 35 నుంచి 40 లక్షల వరకు ధర పలుకుతుందని రైతులు జేసీకి వివరించారు.

'అర్చకుడిపై దాడి అమానుషం'



నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న హిందూ సంఘాల నాయకులు

వేంపల్లె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని చిలుకూరు బాలాజీ అర్చకులు రంగరాజన్‌పై రామరాజ్యం వ్యవస్థాపకులు వీరరాఘవరెడ్డి దాడి చేయడం అమానుషమని హిందూ సంఘాలు మండిపడ్డాయి. బీజేపీ నాయకురాలు సుష్మ, నాయకులు గాలి హరిప్రసాద్,దొంతు సుమన్, సు నీల్‌కుమార్, వీహెచ్‌పీ స భ్యులు అంజన్‌కుమార్, సుబ్బారావు, చందు, ప్రసాద్ తదితరులు నోటకి నల్లగుడ్డ కట్టుకొని మంగళవారం నిరసన తెలిపారు. సమాజ హితమే ధ్యేయంగా సనాతన ధర్మాన్ని, హిందూ సాంప్రదాయాన్ని భవిష్యత్తు తరాలకు అందజేయడమే బాధ్యగా పనిచేసే బ్రాహ్మణులపై ఇలాంటి దాడులు చేసిన వారిపై బ్రాహ్మణ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు : యూటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిది నెలలు అవుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని యూటీఎఫ్ కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు ఆరోపించారు. మంగళవారం కడప నగరం యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన అన్ని రకాల ఆర్థిక బకాయిలను ఆరు మాసాల లోపు చెల్లిస్తామన్నారన్నారు. తక్షణం ఉపాధ్యా య సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులను సమీకరించి ఉద్యమాలకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీవీ రమణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డి.కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గోపీనాథ్, బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల పొట్ట కొట్టొద్దు : ఏఐటీయూసీ



వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు, హమాలీలు

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): హమాలీల పొట్ట కొట్టొద్దని సీడబ్ల్యూసీ గోడౌన్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం అధ్యక్షుడు సుబ్రమణ్యం, ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరంలోని ఏపీ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కడప జిల్లా కార్యాలయంలో సహాయ పౌర సమాచార అసిస్టెంట్ గ్రేడ్-1 అధికారి వాణికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌరసరఫరా శాఖ వారు గిడ్డంగులలో బియ్యం ఆహార నిల్వలను నిలుపుల చేసినందున వంద మంది హమాలీలకు పనిలేకుండా జీవనోపాధి కోల్పోయారన్నారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ గోడౌన్ హమాలీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మా ట్లాడుతూ పాలసీదారులకు మెరుగైన సేవలందించేందుకు నూతన నియామకాలు తక్షణం అవసరమన్నారు. ఎల్ఐసీలో 86శాతం మంది సిబ్బందికి ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) ప్రాతినిథ్యం వహిస్తోందని, బ్యాంకులలో, సాధారణ బీమా, ఇతర రంగాలలో ఇచ్చినట్టుగా తమ సంఘానికి కూడా గుర్తింపు పునరుద్దరించాలన్నారు. లేని పక్షంలో, ఫిబ్రవరి 20న గంటపాటు దేశవ్యాప్తంగా ఎల్ఐసీ సిబ్బంది సమ్మె నిర్వహిస్తారన్నారు. యూనియన్ ప్రతనిధి బృందం పర్సనల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించింది.

ఉర్దూ పాఠశాలను ఎక్కడికీ తరలించం: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో

చెన్నూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండపేట ఉర్దూ పాథమికోన్నత పాఠశాలలో 6,7,8 తరగతులు చదివే విద్యార్థులను ఎక్కడికీ తరలించబోమని డీఈవో శంషుద్దీన్ అన్నారు. 'మా విద్యార్థినులను మ రో పాఠశాలకు తరలిస్తే ఒప్పుకోం' అన్న ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించిన డీఈవో మంగళవారం సాయంత్రం కొండపేట ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలిచడంతో పాటు హెచ్ ఎంషకీలా, ఉర్దూ విద్యార్థుల తల్లిదండ్రులతో, మాజీ సర్పంచ్ మన్నెం మోహన్‌రెడ్డితో మాట్లాడారు. కొండపేట, చెన్నూరుకు మధ్య పెన్నానదిపై హైలెవెల్‌వంతెన ఉంది కాబట్టివిద్యార్థులు వెళ్లినా సమస్యలువస్తాయని చెప్పడంతో పాఠశాలను తరలించమని హామీ ఇచ్చారు. అలాగే ఉర్దూ విద్యార్థుల సంఖ్య కూడా మరింత పెంచి పాఠశాల అభివృద్ధి చేసుకోవాలని డీఈవో తెలిపారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 22 గ్రామ పంచాయితీలలో మంగళవారం మహాత్మాగాంధీ జాతీ య ఉపాధి హామీ సామాజిక తనిఖీ చేపట్టినట్లు పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులలో రూ.10.61కోట్లు పనులకు ఖర్చుచేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని 22 గ్రామ పంచాయితీలలో జరిగిన పనులకు సంబంధించి రూ.62153 రికవరీ చేయించామని ఈ సందర్భంగా పీడీ పేర్కొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

● సీఐ ఈదురుబాషా



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహిళా పీఎస్ సీఐ ఈదురుబాషా

కడప క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మహిళా పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు ఈదురుబాషా అన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం నగరంలోని ప్రభుత్వ ఉర్దూ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. బాగా చదువుకుని సమాజానికి, దేశానికి సేవ చేయాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, డయల్ 100, రహదారి భద్రత, సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళాపీఎస్ సీఐ తెలిపారు. కార్యక్రమంలో యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్ఐ శాంతమ్మ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ జి.మహేశ్, సోషల్ వర్కర్ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీని నిర్మూలిద్దాం: జేసీ

వేంపల్లె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాకు చెందిన రోప్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వెట్టిచాకిరీని నిర్మూలిద్దాం అనే గోడపత్రాలను జిల్లా జాయిం ట్ కలెక్టర్ అదితిసింగ్ విడుదల చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రతినిధి వేమనారాయణ, నరసింహులు, అనురాధ తదితరులు జేసీ చేతుల మీదుగా వాల్‌పోస్టర్ విడుదల చేయించారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఈ కార్యక్రమం నర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐ రంగారావు చేతులమీదుగా వాల్‌పోస్టర్ విడుదల చేశారు.

'రీసర్వేకు రైతులు సహకరించాలి'

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ భూసర్వేకు రైతులు సహకరించాలని కడప ఆర్డీవో జాన్ ఎర్విన్ అన్నారు. మంగళవారం మండలపరిధిలోని అప్పారావుపల్లెలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న రీ భూసర్వేను తహసీల్దారు శివరామిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీభూసర్వేను ప్రారంభించిందని అప్పారావుపల్లె గ్రామం నందు పైలెట్ ప్రాజెక్టుగా చేపడుతున్నామన్నారు. ఈ సర్వేకు రైతులందరూ సహకరించాలన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే తహసీల్దారును సంప్రదించాలన్నారు.

రైతు బజార్‌ను ఉపయోగంలోకి తీసుకురండి

వేంపల్లె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో రూ.1.20కోట్లతో నిర్మించిన రైతు బజార్, రూ.1.30కోట్లతో నిర్మించిన టీటీడీ కళ్యాణమండపాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అధికారులను కోరారు. వేంపల్లెలో నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను సదర్శించారు. అక్కడి ఇన్‌చార్జి రుచితతో మాట్లాడారు. రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే టీటీడీ కళ్యాణమండపాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడారు. పేద మధ్యతరగతి ప్రజలకు కళ్యాణమండపం అందుబాటులో ఉందని, ప్రజలు ఉపయోగించుకుంటారని తెలిపారు. అలాగే వదిలేస్తే శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉందని తెలిపారు.

'దూదేకుల కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయించాలి'

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దూదేకుల కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయించి అర్హులందరికీ తోడ్పడాలని ఆంధ్రప్రదేశ్ నూర్‌బాష్ (దూదేకుల) ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సుంకేసుల ఖాదర్‌బాషా, సుంకేసుల బాదుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మైనార్టీ ముస్లింలకు వర్తించే పథకాలన్నీ దూదేకులకు వర్తింపజేయాలన్నారు. ఎన్నికల హామీలను త్వరితగతిన అమలు చేయాలన్నారు. సుప్రీం కోర్టులో ఉన్న ఓబీసీ 4.5 శాతం రిజర్వేషన్ ప్రక్రియను త్వరితగతిన అమలుచేయాలన్నారు.

విద్యార్థి అదృశ్యం

సికెదిన్నె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి కనపడటం లేదని చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు. వారు అందించిన సమాచారం మేరకు... చింతకొమ్మదిన్నె మండలం గుర్రంగుంపు గ్రామానికి చెందిన ఉత్తమారెడ్డి కుమారుడు కౌసిక్ రెడ్డి ఈనెల 10వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. స్కూలుకు కూడా చేరలేదు. చుట్టుపక్కల గాలించి కనపడకపోవడంతో తండ్రి ఉత్తమారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడని, అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా వివరించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వేంపల్లె క్రిస్టియన్ కాలనీవాసులు

వేంపల్లె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె క్రిస్టియన్ కాలనీలో కొందరు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డి, వారికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆ కాలనీకి చెందిన బాబు, రమేష్, సురేష్, గంగరాజు, విజ య్, అశోక్, సురేంద్ర తదితరులు పార్టీలో చేరినట్లు టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి, ఎస్సీ సంఘం నాయకులు ఈశ్వరయ్యలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరారని,ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని మండల పరిశీలకులు తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, జగన్నాథరెడ్డి, బాలస్వామిరెడ్డి, నామా వేమకుమార్, యుగంధర్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి సహకరించండి



ఈడీని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల అభివృద్ధికి సహకరించాలని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మంగళవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మిని కోరారు. ఈడీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమెను టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ నేతృత్వంలో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఇల్లూరు ఓబులేసు, నగర ప్రధాన కార్యదర్శి మద్దూరు రాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కులాల కార్పొరేషన్లకు నిధులు కేటాయించి స్వయం ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఇదే తరహాలో ఎస్సీల అభివృద్ధికి దోహదపడాలని ఆమెను కోరారు. ఐదవ డివిజన్ యువనాయకుడు చక్రి, ఎస్సీ సెల్ నాయకులు దాసరి ప్రభాకర్, ఊటుకూరు వీరయ్య, టీఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ విశ్వనాథ్, నగర అధ్యక్షుడు అనిల్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

'పొలతల ఈఓపై చర్యలు తీసుకోండి'

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి): పొలతల పుణ్యక్షేత్రంలో గత 30 సంవత్సరాలకు పైగా చిల్లర అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్న తమ దుకాణాన్ని ఇతరులకు దక్కేలా చేసిన ఆలయ ఈఓ క్రిష్ణానాయక్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధితుడు సిరంగి హరికృష్ణ కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను టెండర్ వేయనీయకుండా చేశారన్నారు.

గ్రామ సమాఖ్యల బలోపేతమే

ప్రభుత్వ లక్ష్యం



బాలస్వామి, వెలుగు ఏపీఎం పెండ్లిమర్రి మండలం

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ సమాఖ్యలను బలోపేతం చేసి మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పెండ్లిమర్రి మండల వెలుగు ఏపీ ఎం బాలస్వామి తెలిపారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన ఆ వివరాలు వెల్లడించారు.

ప్రశ్న: పెండ్లిమర్రి మండలంలో ఎన్ని డ్వాక్రా సంఘాలు ఉన్నాయి.

జవాబు: మండలంలోని మొత్తం 19 గ్రామ పంచాయతీలలో 984 డ్వాక్రా సంఘాలు, 34 వీఓలు ఉన్నాయి.

ప్రశ్న: డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు ఏమిటి

జవాబు: డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం నుంచి రూ.పది లక్షల వరకు సున్నావడ్డీ ఉంటుంది. శ్రీనిధి రుణాలు ఒక రూపాయి వడ్డీతో ఇస్తారు. అలాగే రూ.20 ల క్షల వరకు రుణాలు ఇ స్తాం. ఆ డబ్బులో రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ ఉంటుంది.

ప్రశ్న: వీఓఏల విధులు ఏమిటి

జవాబు: గ్రామ పంచాయతీలలో 20 నుంచి 30 సంఘాలకు ఒక వీఓఏ ఉంటాడు. వీరు గ్రూపు సభ్యులు తీసుకున్న రుణాన్ని నుంచి ప్రతినెలా స కాలంలో కట్టించడం, రికార్డులు రాయడం, సమావేశాలు ఏర్పాటు చేయడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడం, శ్రీనిధి రుణాలను రికవరీ చేయించడం వీరి బాధ్యత.

ప్రశ్న: మండల వెలుగు అధికారిగా డ్వాక్రా సంఘాల సభ్యులకు మీరేమి చెప్పదలుచుకున్నారు

జవాబు: ప్రభుత్వం ఇచ్చే రాయితీలతో ప్రతి మహిళను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయాలన్నదే మా లక్ష్యం. ఇందుకు బ్యాంకుల సహకారం ఎంతో అవసరం. సంఘాల మహిళల ద్వారా కుటీర పరిశ్రమలను స్థాపించి ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో పెడుతున్నాం.

వైభవంగా ప్రారంభమైన విజయదుర్గాదేవి వార్షిక బ్రహ్మోత్సవాలు





సింహ వాహనంపై విజయదుర్గాదేవి ఆలయ ప్రదక్షిణ కార్యక్రమంలో సుధా దుర్గాప్రసాద్... అమ్మవారి సేవలో గంటా రవితేజ

కడప కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి పంచామృతాభిషేకం చేశారు. ఉదయం 9.30 గంటలకు ఉత్సవ ప్రారంభ సూచికగా ఆలయ ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేదపండితులు రాయపద్ది సుబ్బరాయశర్మ శిష్య బృందం, ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. యాగశాలలో చండీహోమం, ఆలయ మండపంలో శ్రీచక్రార్చనలు నిర్వహించారు. మొదటి రోజు మంగళవారం కావడంతో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకు రాహుకాల పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు విజయదుర్గా-మల్లికార్జున స్వామి వార్లు సింహవాహనంపై ఆలయ ప్రదక్షిణ చేశారు. కాగా బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు జరుగనున్నాయి. కావున భక్తులు అమ్మవారి బ్రహ్మోత్సవాలలో పాల్గొని ఆ తల్లి ఆశీస్సులు పొందాలని ఆలయ వ్యవస్థాపకుడు సుధా మల్లికార్జునరావు, ఆలయ నిర్వాహకుడు సుధా దుర్గాప్రసాద్ కోరారు.

అమ్మవారి సేవలో గంటా తనయుడు

విజయదుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాష్ట్ర మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రవితేజకు దుర్గాప్రసాద్ ఆలయ మర్యాదలతో అమ్మవారి పట్టు వస్త్రాలను అందజేశారు.

డీఎల్పీఓ విచారణ

వేంపల్లె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో పారిశుధ్యం పనికోసం ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు, వేతనాలు సక్రమంగా ఇస్తున్నారా, ఈపీఎఫ్ నెలనెల చెల్లిస్తున్నారా అనే విషయాలను పులివెందుల డీఎల్పీఓ రమాదేవి ఆరాతీశారు. వేంపల్లెలో పెంచిన వేతనాలు ఇవ్వలేదని, ఈపీఎఫ్, ఎల్ఐసీ సమస్యలు పరిష్కరించాలని పారిశుధ్య సిబ్బంది సమ్మె నోటీసు ఇవ్వగా సర్పంచ జోక్యంతో తాత్కాలికంగా సమ్మెను విరమించి విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయం డీపీఓ రాజ్యలక్ష్మి దృష్టికి వెళ్లగా పూర్తి స్థాయిలో విచారించాలని డీఎల్పీఓను ఆదేశించగా ఆమె విచారించారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఈపంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఆర్బీకేలలో ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో సరస్వతి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రగుడిపాడు, పందిళ్లపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

ఉనికి కోసమే జగన్ ఆరాటం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

కడప(వినాయకనగర్), ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనలో అనేక కుంభకోణాలకు పాల్పడిన జగన్‌మోహన్‌రెడ్డి సిగ్గు లేకుండా 2.0 అంటూ ఉనికిని కాపాడుకోవడానికి కుయుక్తులు పన్నుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సింగారెడ్డి గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందన్నారు. వైసీపీ పాలనలో అటవీ భూములు సైతం బొక్కేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవి శంకర్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ న్యాయవాది గురప్ప, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, నగర అధ్యక్షుడు అనిల్, ఎస్సీ సెల్ పార్లమెంట్ కార్యదర్శి శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు జయరాం, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు లోకేశ్, టీడీపీ నాయకులు సుమన్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

5622 గృహాలలో ఇంటింటా న్యాయప్రచారం

కడప రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఉమ్మడి కడప జిల్లాలో 5622 గృహాలలో ఇంటింటా న్యాయప్రచారం నిర్వహించి 94 మంది ఎదుగుదల లోపాలు ఉన్న పిల్లలను గుర్తించినట్లు డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. కడప నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మంగళవారం డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ఇంటింటా న్యాయప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బాబాఫ క్రుద్దీన్ మాట్లాడుతూ ఉమ్మ డి కడప జిల్లా వ్యాప్తంగా ఇంటింటా న్యాయప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నా రు. పుట్టినప్పటి నుంచి 18 సంవత్సరాల లోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన సమస్యల గుర్తింపు, నివారణ కొరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

రేపు ఉపాధి ఓపెన్ ఫోరం

కాశినాయన ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): ఈనెల 13వ తేదీ నర్సాపురం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఉపాధిహామీ పథకంపై ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు ఏపీవో నాగేంద్రప్రతాప్ తెలిపారు. ఈబహిరంగ సమావేశంలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో ఖర్చుచేసిన నిధులు, చేపట్టిన వివిధ పనులపై సమీక్షించడం జరుగుతుందన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

రాజుపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, వెల్లాల స్కూలులో ఐదో తరగతి ఇంగ్లీషు మీడియం, జూనియర్ ఇంటర్ ఇంగ్లీషు మీడియంలో అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపాల్ తులశమ్మ పేర్కొన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న వారు ఐదో తరగతిలో ప్రవేశానికి, అదే విధంగా పదో తరగతి చదువుతున్న రెగ్యులర్ విద్యార్థులు జూనియర్, ఇంటర్‌కు ప్రవేశానికి అర్హులు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తును 7.2.2025 నుంచి 6.3.2025 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 6.4.2025 తేదీన ఉదయం 10గంటలకు జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్ష, 6.4.2025 మధ్యాహ్నం 2 గంటలకు ఐదో తరగతి పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 9000697778 నెంబరుకు ఫోను చేయాలన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో వెంకటరమణయ్య సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన కలమల్లలోని సచివాలయం 1,2లను ఆకస్మిక తనిఖీలు చేశారు. సచివాలయం 2 పరిధిలో రోడ్డుపైకి మురుగు నీరు వదలడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై రోడ్డుపైకి మురుగునీరు వదలకుండా చర్యలు తీసుకోవాలని ఈ కార్యక్రమంలో కార్యదర్శి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పై రైతులకు అవగాహన

ముద్దనూరు ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మండల పరిధి నల్లబల్లె గ్రామంలో మంగళవారం వాటర్‌షెడ్ యాత్రలో భాగంగా అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించారు.వాటర్ షెడ్‌లో రైతులకు ఉపయోగకరమైన పనులు, అభివృద్ధి కార్యక్రమాల పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ పి.వో రమాదేవి, మద్దులేటి, నరసింహారావు, వాటర్‌షెడ్, ఛైర్మెన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ వివరాలు నమోదు చేయాలి

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల వివరాలు ఈ-శ్రమ్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని రాజంపేట అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సర్కిల్-1 అధికారి లోకపావని పేర్కొన్నారు. మంగళవారం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సర్కిల్-1 లోకపావని, సర్కిల్-2 శశిధర్‌రెడ్డి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ, డ్వాక్రా గ్రూపులు తదితర అసంఘటిత కార్మిక వివరాలను సచివాలయ సిబ్బంది, క్షేత్రసహాయకుల ద్వారా ముమ్మరంగా వివరాల నమోదును చేయాలని పేర్కొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



సూచనలిస్తున్న సీఐ, ఎస్ఐ

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ హాస్టళ్లలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని నేరాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి అన్నారు. మంగళవారం పోరుమామిళ్లలోని కస్తూర్బా బాలికల పాఠశాల సాంఘిక సంక్షేమ హాస్టల్, ఓఎల్ఎఫ్, గర్ల్స్ హైస్కూలు సంద ర్శించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అక్కడ నిర్వహణ చేస్తున్న వారికి ఆదేశాలు ఇచ్చారు.

రోడ్డు, కాలువ పనులు చేసేదెన్నడు..?





కంకర తేలి, దుమ్ము రేగుతున్న రోడ్డులో వాహనదారుల ఇబ్బందులు, దొమ్మరనంద్యాల హైస్కూలు ఎదురుగా కాలువ తీసి వదిలేసిన దృశ్యం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామం శ్రీరాములపేట వద్ద జమ్మలమడుగు, మైలవరం వెళ్లే రోడ్డు చదును చేసి వదిలేశారు. దాదాపు 50 రోజుల నుంచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ గుంతలు పడిన రోడ్డు వద్ద డోజర్‌తో చదును చేసి రోడ్డు వేయకుండా వదిలేశారు. దీంతో ఆ ప్రాంతంలో వెళ్లే వాహనదారులు కాలుష్యంతో దుమ్ముతో ఇబ్బంది పడుతున్నారు. అలాగే దొమ్మరనంద్యాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా గత నెలలో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో పొంచి ఉన్న ప్రమాదం విద్యార్థులకు ఇబ్బందులు అనే కథనం ప్రచురితం కావడంతో వెంటనే కాలువ నీళ్లు వెళ్లేలా నిర్మాణం చేసేందుకు తీశారు. సుమారు 50 రోజుల నుంచి అక్కడ సమస్య ఉంది. ప్రధాన రోడ్డులో రోడ్డు వేయకుండా వదిలేశారని, అదే విధంగా పాఠశాల ఎదురుగా కాలువ నిర్మాణం చేపట్టలేదని ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్ స్పందించకపోవడం దారుణమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

వాట్సాప్ సేవలపై అవగాహన పెంచుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరం చేసి ప్రజల వద్దకే తెచ్చిందని వాట్సాప్ గవర్నెన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్వీ డిగ్రీ కళాశాలలో వాట్సాప్ గవర్నెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చేతన్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డిభార్గవ్, నవీన్, వెంకటేష్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి

కొండాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గండ్లూరు గ్రామంలో రూ.4.9 లక్షలతో నిర్మించిన మినరల్‌వాటర్ ప్లాంటును మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, గండ్లూరు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ పరులైతే బ్యాక్‌లాగ్ బియ్యం ఇవ్వండి: టీడీపీ



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు, టీడీపీ నాయకులు

ఖాజీపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రేషన్ బియ్యం స్వాహా చేసి బ్యాక్‌లాగ్ పెట్టి పారిపోయిన మీరు ఎక్కడ, నిజాయితీగా పంచుతున్న మేము ఎక్కడ అని టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, నాగనాథేశ్వర కోన ఛైర్మన్ గంగవరం ఆదినారాయణరెడ్డి అన్నారు. మంగళవారం తహసీల్దారు మహబూబ్‌బాషకు రేషన్ డీలర్లు, టీడీపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని డీలర్లు 600 క్వింటాళ్ల బ్యాక్‌లాక్ పెట్టారని ప్రభుత్వం పోయిన వెంటనే నిజాయితీ పరులైతే పేదల బియ్యం కొని ఇచ్చేవారన్నారు. కాగా పేదలకు సక్రమంగా బియ్యం అందేలా చర్యలు తీసుకుంటామని బ్యాక్‌లాక్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తహసీల్దారు మహబూబ్‌బాష అన్నారు.

● రేషన్ డీలర్ల అధ్యక్ష ఎంపిక..: టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో రేషన్‌షాపు యజమానులు మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో ఏకగ్రీవంగా అధ్యక్షుడుగా సుంకు వెంకట కామాక్షి, ఉపాధ్యక్షులుగా కె.రంతుబిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మీరెడ్డి, కొమ్మలూరు శంకర్‌రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

చోరీదారుడు ఇంటి దొంగే

అట్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎగువపల్లె కాలనీలో నివాసం ఉంటున్న చల్లకొండయ్య ఇంట్లో డిసెంబరు 6న బంగారుచోరీ జరిగింది. పట్టపగలే తాళాలు సమ్మెటతో పగలగొట్టి బంగారు నగలు చోరీ జరగడంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడంతో మంగళవారం బంగారం దొంగలించిన బాలుడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఫిర్యాదుదారుడి చిన్నాన్న కొడుకే వారి ఇంటిలోనే ఉంటూ అనుమానం లేకుండా చోరీ చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. కొండయ్య నివాసం ఉంటున్న చుట్టుపక్కల వారిని విచారించి సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించి చోరీదారున్ని విచారించగా దొంగతనాన్ని ఒప్పుకున్నాడన్నారు. దొంగలించిన ఆరు బంగారు వస్తువులు ఆరుతులాలు ఉన్నాయన్నారు. చోరీదారుడైన బాలున్ని జువైనల్ హోంనకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, శేకర్, చంద్ర పాల్గొన్నారు.

బైకు నుంచి చెలరేగిన మంటలు



బద్వేలుటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణం మైదుకూరురోడ్డులో వైన్ షాపు వద్ద మంగళవారం పార్క్‌చేసి ఉంచిన బైకు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించి, అక్కడే ఉన్న కొందరు నీళ్లు పోసి మంటలను అదుపు చేశారు. అధిక ఉష్ణోగ్రత, ఎక్కువ దూరం వాహనాలను నడపటం వలన ఓవర్‌హీటై మంటలు చెలరిగినట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతా నియమాలు పాటించినప్పుడు ప్రమాదాలు నివారించవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నారాయణ నాయక్ పేర్కొన్నారు.మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆర్‌టీవో కార్యాలయంలో ఆటో డ్రైవర్లు, డీలర్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌టీవో మురళి, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: మండలంలో ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా, ఓవర్‌లోడు కలిగి ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంలోనే క్రైస్తవమైనార్టీలకు సంక్షేమం



మాట్లాడుతున్న స్వామిదాస్

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో క్రైస్తవ మైనా ర్టీలకు అధిక సంక్షేమం జరిగిందని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ పేర్కొన్నారు. మంగళవారం ఎర్రగుంట్ల టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉంటేనే రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు బాగుపడుతారన్నారు. గుంటూరు,విజయవాడ సమీపంలో రెండెకరాల స్థలం కేటాయించి క్రిస్టియన్ భవన్ నిర్మాణానికి రూ.10కోట్లు కేటాయించారన్నారు. రమేష్‌రెడ్డి, విజయశేఖర్, దీపక్, వరప్రసాద్ పాల్గొన్నారు.

బండినర్వ దేవాలయ నిర్మాణానికి నిధులు మంజూరు



విజయమ్మను సన్మానిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టేకూరుపేట వెళ్లే దారిలో బండి నర్వ దేవాలయ ప్రదేశంలో పోరుమామిళ్ల, బికోడూరు, కాశినాయన, కలసపాడు మండల దాతల సహకారంతో 108 శివలింగాలతో శ్రీనందీశ్వరయ్య ఆలయాన్ని నిర్మించి అభివృద్ధి చేయాలని కమిటీ సభ్యులు సంకల్పించారు. ఆ మేరకు బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి కృషితో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోటి రూపాయలు ప్రభుత్వ నిధులు దేవాలయ నిర్మాణానికి మంజూరు చేయించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేవిజయమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు గుర్విరెడ్డి, ప్రధాన కార్యదర్శి నూనె శ్రీనివాసులు, కమిటి సభ్యులు వెంకటరెడ్డి, పణిరావు, పుల్లప్పనాయుడు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వేదిక్ మ్యాథ్స్‌లో రాష్ట్రస్థాయి ప్రథమ స్థానంలో ప్రొద్దుటూరు విద్యార్థి



సిద్ధార్థ్‌రెడ్డి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి వేదిక్ మాథ్స్ పోటీ పరీక్షలలో ప్రొద్దుటూరు మాంటిస్సోరి హైస్కూలుకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి సిద్ధార్థ్ రెడ్డి ప్రథమ బహుమతి సాధించినట్లు ఆ హైస్కూలు కరస్పాండెంట్ ఎస్వీ మహమూద్ తెలిపారు. ఫిబ్రవరి 9 తేదీన విజయవాడలోని విశ్వం ఎడ్యుటెక్ వారు వేదిక్ మాథ్స్‌పై రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారన్నారు. త్వరలో చెన్నైలో జరగబోయే నేషనల్ పోటీల్లో పాల్గొనడానికి సిద్ధార్థ్ అర్హత సాధించాడన్నారు.

ఘనంగా పోలేరమ్మ 5వ వార్షికోత్సవం



ఖాజీపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి మల్లాయపల్లెలోని పోలేరమ్మ తల్లి అమ్మవారి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి వారి మొక్కులు తీర్చుకోనున్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్ రెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగళ శశిభూషణ్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. స్థానిక మార్కెట్‌యార్డ్‌లో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం కందులకు క్వింటాల్‌కు రూ.7750 మద్దతు ధర నిర్ణయించిందన్నారు.10 రోజులలో రైతుల ఖాతాలలో నగదు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పరిమళ జ్యోతి, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ ఖాదర్‌వల్లీ, రాజుపాళెం ఏఓ శివరామక్రిష్ణారెడ్డి,కేటీపీ ఎఫ్‌టీఓ ఛైర్మన్ సహదేవరెడ్డి, బీజేపీ రాష్ట్ర కోశాధికారి సి.వి. జయలక్ష్మి, క్రిష్ణ ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వంకదార నరేంద్ర రావ్, శ్రీకాంత్, శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో లేపాక్షి డిగ్రీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మొదటి సెమిస్టర్ బీఎస్సీలో తమ విద్యార్థులు ఉత్తమఫలితాలు సాధించినట్లు లేపాక్షి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, కరస్పాండెంట్ రాఘవరెడ్డి, తెలిపారు. బీఎస్సీలో సుధ 10, రాణి 9.5, బీకాంలో పూజిత, హిమశ్రీ 9.5 మార్కులు సాధించారు. మూడో సెమిస్టర్ బీఎస్సీలో రిజ్వానా 9.85, మల్లేశ్వరి 9.7, బీకాంలో తాహిన్ 9.35, సానియా 9.30 మార్కులు సాధించారు. 5వ సెమిస్టర్ బీఎస్సీలో భారతిలక్ష్మి 9.49, తేజశ్విని 9.22, బీకాంలో వనిత 9.77, ముస్కాన్ 8.74, సుధీర్ ఆచారి 8.58 మార్కులు సాధించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, కరస్పాండెంట్ రాఘవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

వేదవ్యాస విద్యార్థుల ప్రతిభ...



ప్రతిభ కనపరిచిన వేదవ్యాస కళాశాల విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మొదటి సెమిస్టర్ బీఎస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు వేదవ్యాస డిగ్రీ కాలేజీ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మొదటి సెమిస్టర్ బీఎస్సీలో నరేంద్ర, లలిత 10, బీకాం కంప్యూటర్స్‌లో అనిత, హరిత 9.5 మార్కులు సాధించారు. మూడో సెమిస్టర్ బీఎస్సీలో సునంద 9.65, గౌస్‌బీ 9.40, బీకాం కంప్యూటర్స్‌లో నీరజ 9, అనిత 8.95, 5వ సెమిస్టర్ ఎంపీసీఎస్‌లో చాంద్‌బీ 9.33, నాగేశ్వరి 9.13, ఎంఎస్‌సీఎస్‌లో పూజిత 9.03, జ్యోతి స్వరూప్ 9.02, బీకాం కంప్యూటర్స్‌లో అతిఫాబాను 8.81, షామీరా 8.59 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఆర్‌టీడీ విద్యార్థులు...



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఫస్ట్‌సెమిస్టర్ బయోటెక్నాలజీలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరినట్లు ఆర్టీడీ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, కరస్పాండెంట్ తరుణేంద్రశేఖర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వెంకటస్వర్ణ 10, లావణ్య 9.50, ఎంఎస్‌సీఎస్‌లో హర్షిత, శైలజ 9.50 జీపీఏ మార్కులు సాధించారు. బీకాం కంప్యూటర్స్‌లో నాగసిద్ధేశ్వరి 9.50, మూడో సెమిస్టర్ బయోటెక్నాలజీలో భూస్రాఫిర్‌దౌస్ 9.68, స్రవంతి 9.56, ఎంఎస్‌పీఎస్‌లో యశశ్విని 8.85, అజీజా 8.34, బీకాం కంప్యూటర్స్‌లో సుగుణకుమారి 8.76, యాస్మిన్ 8.75 మార్కులు సాధించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, కరస్పాండెంట్ తరుణేంద్రశేఖర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.


ఎస్‌కేపీఎస్‌సీ విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ 5వ సెమిస్టర్ బయోటెక్నాలజీలో ఆస్మిన్ 9.36, శ్రీవల్లి 9.23, బీఏలో స్వాతి, సౌమ్య 8.55, బీకాం కంప్యూటర్స్‌లో షాహిన్ 8.41 మార్కులు సాధించారు. మూడో సెమిస్టర్ బయోటెక్నాలజీలో దీప 9.40, కంప్యూటర్స్‌లో అనిత 9.35, బీకాం కంప్యూటర్స్‌లో నాగేశ్వరి 9.20, బీఏలో అంజలి 9.5, బయోటెక్నాలజీలో విద్రుస్‌వల్లి 9.50, సుప్రజ 9.50, బీఎస్సీ కంప్యూటర్స్‌లో షాహిన్ 9.50, బీకాం కంప్యూటర్స్‌లో సర్జానా 9.0 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ నంద్యాల కొండారెడ్డి, సీఈవో మీనా కొండారెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఎస్వీ కళాశాల విద్యార్థుల విజయం



విద్యార్థులకు స్వీట్లు అందజేస్తున్న కరస్పాండెంట్ హరినారాయణ

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వైవీయూ యూనివర్శిటీ సెమిస్టర్ పలితాల్లో 1వ సెమిస్టర్ జువాలజీలో నబీరా, తాహెముస్కాన్, బయోటెక్నాలజీలో విల్మాబ్లస్సీనా, మూడో సెమిస్టర్ జువాలజీలో మంజులత, మాధవి, తేజశ్విని, లక్ష్మీలాలస 10కి 10 మార్కులు సాధించారు. మొదటి సెమిస్టర్ జువాలజీలో బాలాజీ, గౌషియాబేగం, సుప్రియ 9.5, బీకాం కంప్యూటర్స్‌లో స్వర్ణ 9.5, బీసీఏలో అఖిల 9.5, బీబీఏలో అఫ్నాన్, లక్ష్మీప్రవళ్లిక, ఫర్హానా, అబ్రార్ 9.0 మార్కులు సాదించారు. మూడో సెమిస్టర్ జువాలజీలో తస్లిం 9.85, బయోటెక్నాలజీలో జ్ఞానశ్రీ 9.85, బీసీఏలో పవిత్ర 9.85, బీకాంలో పరిమళ 9, బీఎస్సీ కంప్యూటర్స్‌లో లక్ష్మీప్రసన్న 9.25, 5వ సెమిస్టర్ బీజెడ్‌సీలో రెహనా 9.79, బీకాంలో యాస్మిన్ 9.1 మార్కులు సాధించారు. విద్యార్థులను కరస్పాండెంట్ హరినారాయణ, ప్రిన్సిపాల్ మహమ్మద్‌ముస్తఫా, అధ్యాపకులు అభినందించారు.

ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ సెమిస్టర్ ఫలితాల్లో మొదటి సెమిస్టర్ బీఏలో బషీరిన్, హసీనా, అసిఫాలు 10కి 10 మార్కులు సాధించారు. బీఎస్సీ ఫిజిక్స్‌లో వైష్ణవి 9.5 మార్కులు, తృతీయ సంవత్సరం బీజెడ్‌సీలో సుంకు నాగశ్రీ 9.33 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయకేతనం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సెమిస్టరు పరీక్ష ఫలితాల్లో పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్యూల్ తెలిపారు. యూనివర్సిటీ టాపర్స్‌గా వరికుంట్ల పవన్‌కుమార్, కొడివటికంటి ఓబయ్య, రెండో ర్యాంకు నవీన్ జ్యోతి, రోహిణి, శివకుమార్ నిలిచారన్నారు. ఓర్సు గురప్పడు, త్రివిక్రమ సింహా, దస్తగిరిమ్మ, నవిత, వెంకటేశ్, చేతన, రజిత, కిరణ్‌కుమార్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.